

మంచిర్యాల ఏసీసీ : జన్మభూమి నగర్ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శ్రీరాంపూర్ : జన్మభూమి నగర్ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



లక్షెట్టిపేట : బతుకమ్మ సంబురాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

# వాడ వాడలా పూల పండుగ

- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆడి పాడిన ఆడబిడ్డలు




మంచిర్యాల విశ్వనాథ స్వామి దేవస్థానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





బతుకమ్మతో చిన్నారులు

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 22 : సద్దుల బతుకమ్మ పండుగ ఆదివారం వైభవంగా జరిగింది. తంగెడు, గునుగు, గుమ్మడి, బంతి, సీతమ్మ, తీరొక్క పూలతో రంగుల హరివిల్లులా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం గౌరమ్మకు పూజలు చేసి ప్రధాన కూడళ్ల వద్దకు బతుకమ్మలను తీసుకువచ్చి ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలో విశ్వనాథ స్వామి ఆలయం, గౌతమినగర్ కోదండరామాలయం, సాయిబాబా ఆలయం, తెలంగాణ చౌరస్తా, రెడ్డికాలనీ, ఎన్టీఆర్ నగర్, రాంనగర్, ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద బతుకమ్మను ఆడిపాడారు. యువతులు కోలాటాలు, డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలుచేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన రాళ్లవాగు, రాముని చెరువు, హమాలీవాడ కట్టపోచమ్మ చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తీసుకవచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకొని, వాయినాలను ఇచ్చుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు, నాయకులు బతుకమ్మల వేడుకల్లో పాల్గొన్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు...**

సద్దుల బతుకమ్మ సందర్భంగా మంచిర్యాల పట్టణంలో మున్సిపల్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. విద్యుత్ దీపాలను, నీటిలో లోతుకు వెల్లకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూశారు.

**హాజీపూర్ మండలంలో..**

హాజీపూర్, అక్టోబర్ 22 : సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే తీరొక్క పూలను సేకరించి, బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం గ్రామ కూడళ్ళు, ఆలయాల ఆవరణలో బతుకమ్మల చుట్టూ రాత్రి వకు ఆడి పాడారు. అనంతరం సమీప వాగుల్లో, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. హాజీపూర్ మండలంలో అన్ని గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

**నస్పూర్‌లో..**

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 22: నస్పూర్ మున్సిపాలిటీలో సద్దుల బతుకమ్మ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీసీసీ కార్నర్, గోదావరి కాలనీ షిర్కె చౌరస్తాలో పూల వ్యాపారులు, కొనుగోలుదారులతో సందడిగా మారింది. మహిళలు అత్యంత ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా చివరి రోజు సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేసుకోవడంలో తలమునకలైయ్యారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు తీరొక్క రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, సత్తు పిండి తయారు చేయడంలో నిమగ్నమైయ్యారు.

**దండేపల్లిలో..**

దండేపల్లి, అక్టోబర్22: దండేపల్లి మండలంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.తంగేడు, గునుగు, బంతి, పట్టు కుచ్చులతో పాటు వివిధ రంగులతో అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆరాధ్య దైవమైన గౌరమ్మను ఉంచి పాటలు పాడుతూ ఊరేగింపుగా వెళ్లి సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు. వెళ్లిరా....బతుకమ్మ ...మళ్లీ రా అంటూ.. ఆడబిడ్డలు వీడ్కోలు పలికారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, అక్టోబర్ 22: సద్దుల బతుకమ్మ వేడుకలను పట్టణంలో మహిళలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు బతుకమ్మ సంబురల్లో పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాత్రి వరకు బతుకమ్మ ఆడిన మహిళలు ఊరేగింపుగా సమీపంలోని చెరువుల వద్దకు చేరుకొని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్ల నేలపై బతుకమ్మ సంబురాలు

శ్రీరాంపూర్, అక్టోబర్ 22: శ్రీరాంపూర్ కోల్‌బెల్ట్ ఏరియాలో ఆదివారం కార్మికుల కాలనీల్లో, సింగాపూర్, తాళ్లపల్లి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాకాలనీలోని శాంతి స్టేడియంలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మహాబతుకమ్మ వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకలను జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమరి ప్రారంభించారు. ఉత్తమ బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులు అందించారు. మున్సిపాలిటీ అధికారులు, సింగరేణి యాజమాన్యం కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసింది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో, సింగరేణి ఏర్పాటు చేసిన కొళనులో, వాగుల్లో నిమజ్జనం చేశారు. సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైజీఎం అరవింద రావు, అనంద్‌కుమార్, ఎస్ఓటూజీఎం రఘుకుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీఓలు దేవేందర్ రెడ్డి, కాంతారావు పాల్గొన్నారు.



దండేపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దండేపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శ్రీరాంపూర్ : మహా బతుకమ్మ వేడుకలు ప్రారంభిస్తున్న జీఎం దంపతులు



సీసీసీ నస్పూర్ : బతుకమ్మ పేర్చుతున్న మహిళలు